క్లుప్తంగా

డ్రగ్స్‌తో జీవితాలు ఛిద్రం



సదస్సులో మాట్లాడుతున్న ఉపేంద్ర

కంచరపాలెం : మాదకద్రవ్యాల వల్ల ఒనగూరే దుష్ఫలితాల పట్ల ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్. ఉపేంద్ర పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ వాడొద్దని, జీవితాలు దుర్వినియోగం చేసుకోవద్దని, ఆయన సూచించారు. డ్రగ్ రాకెట్‌ను మూలాల నుంచి తొలగించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రయత్నిస్తోందన్నారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కె.ఎం. కుమారి డ్రగ్స్ ఫ్రీ దేశంగా తీర్చిదిద్దుతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ జి.దాసు, డాక్టర్ ప్రవీణ్, ఎస్. రాంబాబు, సురేష్‌బాబు, ప్రియాంకరాణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు రాజుగౌడ్, డబ్బీరు కుమారస్వామి తెలిపారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్క నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుని టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్ ద్వారా ఉన్నత విద్యాభ్యాసం చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. సింధూర ఎడ్యుకేషన్ అకాడమీ ప్రొఫెసర్ డీకే రెడ్డి ఆధ్వర్యంలో నడుపుతున్న ఇనిస్టిట్యూట్‌లో ఓపెన్, ఇంటర్మీడియట్ కోసం కోచింగ్, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9063648888 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, సూరిబాబు, శివకుమార్, సయ్యద్ ముస్తాఫా పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్ల సభ్యులు

గోపాలపట్నం: ఎన్ఎస్‌టీఎల్‌లో నిర్వహించిన డీఆర్‌డీవో సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ నెల 7 నుంచి శుక్రవారం వరకూ పోటీలు జరిగాయి. ఆర్‌సీఐ హైదరాబాద్ ఎమర్జిడు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుంది. ఎన్ఎస్‌టీఎల్ రన్నరప్‌గా నిలిచింది. వీరికి ట్రోఫీని నిర్వాహక కమిటీ సభ్యులు అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా శ్రద్ధగా చదవాలి



విద్యార్థులతో ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్వారకానగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథి నాలుగో పట్టణ క్రైం ఎస్ఐ భాస్కరరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు చదివి, వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఇందిరా మున్సిపల్ స్టేడియం



గ్యాలరీకి సగం వరకే రంగులు వేసిన దృశ్యం



పూర్తి కాని ఫుట్‌పాత్‌లు

ఎక్కడి పనులు అక్కడే

- దయనీయ స్థితిలో ఇందిరా మున్సిపల్ స్టేడియం
- కోట్లాది రూపాయల నిధులు వృథా

ఇందిరా మున్సిపల్ స్టేడియం గతంలో ఒక వెలుగు వెలిగింది. అయితే తర్వాతి కాలంలో ఇది శిథిలమైంది. తుప్పలు పట్టి, స్క్రాప్ వాహనాలకు నిలయంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగాను మారింది. ఒకప్పుడు అంతర్జాతీయ క్రీడాకారులు తమ కౌశలాన్ని చూపిన ఈ మైదానం శిథిల దశకు చేరుకుంది. అయినప్పటికీ ఏ ఒక్క ప్రభుత్వం పట్టించుకోలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాతే ఈ స్టేడియంకు మంచి రోజులు వచ్చాయి. రూ. 5 కోట్ల వరకు నిధులు మంజూరు చేసి అనేక అభివృద్ధి పనులు మొదలుపెట్టింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం. ఈ నేపథ్యంలో కొన్ని పూర్తయ్యాయి. దురదృష్టవశాత్తు ప్రభుత్వ మార్పిడి కారణంగా ఇంకా కొన్ని పనులు మిగిలిపోయాయి. వాటిని త్వరగా పూర్తి చేయాలని క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు, స్టేడియంలో వాకింగ్, జాగింగ్, వ్యాయామాలు చేసుకునే స్థానికులు కోరుతున్నారు.



ప్రారంభం కాని చిన్నారుల క్రీడా ప్రాంగణం



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన పెలియన్ బాక్స్ పనులు



మధ్యలో ఆగిపోయిన ఇందిరా మున్సిపల్ స్టేడియం గ్యాలరీ పనులు

జగదాంబ : ఇందిరా మున్సిపల్ స్టేడియం.. ఒకప్పుడు ప్రపంచ ప్రఖ్యాత ఆటగాళ్లతో కూడుకున్న క్రికెట్ పోటీలు ఇక్కడ ఎన్నో జరిగాయి. ఎన్నో హంగులు.. ప్రత్యేకతలతో ఈ మైదానం క్రీడాభిమానుల మన్ననలు పొందింది. అలాగే స్థానిక ఆటగాళ్ల క్రీడల ప్రాక్టీస్ చేసుకునేందుకు.. వాకింగ్, వ్యాయామం చేసుకునే వారికి ఉపయుక్తంగా ఉండేది. అయితే తర్వాతి కాలంలో ఈ స్టేడియం తన ఉనికి కోల్పోయింది. ఇక్కడ మ్యాచ్‌లు జరగటం ఆగిపోయింది. అలాగే అభివృద్ధి.. నిర్వహణ కూడా. దీంతో ఈ స్టేడియంలో పెవిలియన్, గ్యాలరీ, విఐపీ బాక్స్‌తో పాటు అన్ని ప్రధాన విభాగాలు శిథిల దశకు చేరుకున్నాయి. ఏ ప్రభుత్వాలు ఈ స్టేడియం అభివృద్ధికి ముందుకు రాలేదు. ఈ దశలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంది. స్టేడియం అభివృద్ధికి సుమారు 24 పనులకు టెండర్లు పిలిచారు. రూ. 5 కోట్లకు పైగా నిధులు వెచ్చించారు. దీంతో కొన్నేళ్లుగా కనీసం మరమ్మతులకు నోచుకోని స్టేడియం మళ్లీ జాతీయ స్థాయి క్రీడలకు వేదికగా మారగలదని క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎక్కడి అభివృద్ధి అక్కడే..

స్టేడియం అభివృద్ధితో పాటు క్రీడలకు రూ. 5 కోట్లకు పైగా నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో రహదారులు, కాలువలు, ప్రధాన ద్వారాలు, రెయిన్‌బో గ్యాలరీలు, పెవిలియన్ బాక్స్‌లు, స్టేడియం చుట్టు మొక్కల పెంపకం, విద్యుత్ వెలుగులు, చిన్నారుల ప్లేగ్రౌండ్, యువకులు, మహిళలకు ఓపెన్ జిమ్‌లు, ఇండోర్ గేమ్‌లు, షటిల్, బాక్సింగ్ రింగ్‌లు, గ్యాలరీ చుట్టు ఇనుప ఫెన్సింగ్, స్కోరు బోర్డు వంటివి అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు సాగాయి. పనులు కూడా కొంత వరకు పూర్తయ్యాయి. అయితే తదనంతర కాలంలో ప్రభుత్వం మారి నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందులో చాలా పనులు ఎక్కడివి అక్కడ ఆగిపోయాయి.

మండిపడుతున్న క్రీడా ప్రేమికులు..

ఇందులో టెన్నిస్ కోర్టు, బాక్సింగ్ రింగ్‌లు, ల్యాండ్ స్కేపింగ్, వంద కార్ల పార్కింగ్ వంటి పనులు కనీసం మొదలు కాకపోవడం పట్ల యువత, క్రీడా ప్రేమికులు మండిపడుతున్నారు. స్టేడియంలో పురుషులతో పాటు మహిళలకు ఓపెన్ జిమ్‌లు, చిన్నారులకు క్రీడా ప్రాంగణాలు పూర్తి చేసినా ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో మళ్లీ అవి మూలకు చేరుతున్నాయి. అలాగే ఆట వస్తువులు ఆరు బయటే ఉండడంతో వర్షాలకు జంగు పట్టి, కళాహీనంగా తయారవుతున్నాయి. వాకర్స్ కోసం ఏర్పాటు చేసిన టైల్స్ నాచు పట్టి నడవడానికి వీల్లేకుండా జారిపోతున్నాయని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయాలతో ముడిపెట్టొద్దు..



స్టేడియం అభివృద్ధిని రాజకీయాలతో ముడి పెట్టకుండా అభివృద్ధి చేయాలి. అలా చేస్తే స్థానిక క్రీడాకారులు, వాకర్లు, వ్యాయామం చేసుకునే వారికి ఉపయుక్తంగా ఉంటుంది. ఇలాంటి స్టేడియంలు అభివృద్ధి చేస్తేనే క్రీడాకారులు పుట్టుకొస్తారు. ఈ విషయంలో అశ్రద్ధ తగదు.

– ఆదినారాయణ, వెలంపేట వాకర్

పిల్లలకు రక్షణ..



పిల్లలు బయటికి వెళ్లి ఆడుకునే దానికన్నా స్టేడియంలో ఆడుకోవడం సురక్షితం. కనుక ఇందిరా మున్సిపల్ స్టేడియంను త్వరగా ఆధునికీకరించాలి. ఈ స్టేడియం అభివృద్ధి జరిగితే క్రీడాకారులు, నడక, వ్యాయామాల కోసం వచ్చే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– గంగాధర్, కల్లుపాకలు

బడ్జెట్‌లో దళితుల పట్ల వివక్ష



మాట్లాడుతున్న జేవీ ప్రభాకర్

డాబాగార్డెన్స్ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దళితుల పట్ల వివక్ష చూపిస్తుందని, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ప్రాతిపదికన 15 శాతం బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉండగా, పూర్తిగా కోత విధించిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ తెలిపారు. సిటు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్‌కు చివరి ప్రాతిపదికన కేటాయింపు చేశారని దుయ్యబట్టారు. 1980 నుంచి ఈ ప్లాన్ అమల్లో ఉందన్నారు. రూ. 51 లక్షల కోట్ల బడ్జెట్లో 15 శాతం వాటా ప్రకారం 7.5 లక్షల కోట్లు రావాల్సి ఉండగా, 2.5 లక్షల కోట్లే కేటాయించారని చెప్పారు. జాతీయ స్థాయిలో సబ్‌ప్లాన్ అమలు చేయాలని, బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం 41ఏ నోటీస్ ఇచ్చి కేసులు మంజూరు చేయడం దారుణమన్నారు. చట్టాన్ని సవరించి తప్పనిసరి అరెస్టు చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. అరెస్టు నుంచి తప్పించుకోవడంతో అట్రాసిటీ యాక్ట్ నిర్వీర్యం అవుతుందని తెలిపారు. ఫలితంగా భయం పోయి మరిన్ని కేసులు పెరిగిపోతున్నాయని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజులు మాట్లాడుతూ బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సవరణలు చేసి అరెస్టు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ కార్యదర్శి రాంబాబు, కేవీపీఎస్ నాయకులు సుబ్బన్న, చిరంజీవి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు కల్యాణ్‌రావు, గౌతం బాబు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

31న కౌన్సెలింగ్

మధురవాడ : బక్కన్నపాలెంలో గల ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి ఐటీఐ ట్రేడుల్లో పురుష దివ్యాంగ యువతను చేర్చుకునేందుకు మూడో దశ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 31న హాజరు కావాలని పీవో జె.మాధవి తెలిపారు. శిక్షణ కేంద్రంలో కార్పెంటర్–18, షీట్ మెటల్ వర్కర్ – 5, పెయింటర్ – 15 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

ఆలయాలకు శ్రావణ శోభ



పండ్ల అలంకరణలో టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలోని ఉమాదేవి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ



నీలమ్మ వేపచెట్టు అమ్మవారు

అల్లిపురం : శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా దేవాలయాలు శ్రావణ శోభ సంతరించుకున్నాయి. టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమా దేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ఆలయ అర్చకుడు జోగారావుశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అల్లిపురం శ్రీ అలమేలు మంగమ్మ ఆలయం, మూడుగుళ్లు, కనకదుర్గమ్మ ఆలయం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం, జెండాచెట్టు వీధిలోని విజయ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. నేడు మొదటి శ్రావణ శుక్రవారం కావటంతో మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. ఇంటి గడపలకు పచ్చతోరణాలు, పూలదండలతో అలంకరించారు.

మహిళా కళాశాలలో హిరోషిమా నాగసాకి దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల



కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న క్యాడెట్లు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిరోషిమా నాగసాకి దినోత్సవం నిర్వహించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలు ప్రపంచ శాంతికి దోహదపడేలా వినియోగించే విధంగా విద్యార్థులు విద్యనభ్యసించాలని సూచించారు. విద్యార్థులు వివిధ పోస్టర్లు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రపంచ శాంతికి రసాయన శాస్త్రం అనుసంధానించే విధి విధానాలు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి బి. సంతోషి అనూష, డాక్టర్ బి. కల్యాణ్‌రామ్, ఎం. విద్యా కల్పన, డాక్టర్ ఎ. హైమావతి, డి. అరుణపద్మ, డాక్టర్ ఆర్. కిరణ్మయి, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

కళాశాలలో స్వచ్ఛభారత్..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్లు, స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి కె. గీతాంజలి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి పాల్గొని క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. మన ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మనకి ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో పలువురు క్యాడెట్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి వాసుపల్లి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : పేద విద్యార్థినికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. 39వ వార్డు పాత పోస్టాఫీస్‌కి చెందిన మైనార్టీ మహిళ ఎండీ ఫాతిమా కుమార్తె సైమా సారా చదువు కోసం తన సొంత నిధుల నుంచి రూ.5 వేలు శుక్రవారం వాసుపల్లి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా మంది పేదలున్నారని, వారి కోసం తన వంతు సాయంగా విరాళాలు అందిస్తున్నానని తెలిపారు. పిల్లలకు మంచి విద్య అందించి, తోటి వారికి సాయం అందించే గొప్ప స్థాయికి ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకుడు ముజీబ్‌ఖాన్, గనగళ్ల రామరాజు, రాము, షకీల్, వేణు తదితరులు పాల్గొన్నారు.

హీరో మహేష్‌బాబు సేవలు నిరుపమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్ : హీరో మహేష్‌బాబు సేవలు నిరుపమానం అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్వర్యంలో మహేష్‌బాబు 49వ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న వాసుపల్లి ముందుగా కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమకు వన్నె తెచ్చిన కృష్ణ సినిమాలు చూస్తూ పెరిగానని, తన ప్రతి విజయానికి ఇన్స్పిరేషన్ కృష్ణ అన్నారు. అటువంటి మహనీయుడి కుమారుడు మహేష్‌బాబు చేస్తున్న సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో విశాఖ సిటీ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతి చెందిన కాకర అప్పారావు

కొమ్మాది: పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బావిలో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలివీ.. పూర్ణా మార్కెట్‌కు చెందిన కాకర అప్పారావు (41) వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఊరు వెళ్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. శుక్రవారం ఓజోన్ వ్యాలీ రోడ్డు దరి ఓ బావిలో విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారంతో పీఎం పాలెం పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల కల్పనతోనే సమర్థంగా విధుల నిర్వహణ



సిబ్బందికి నూతన కిట్ బాక్సులను అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : పోలీస్ సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పిస్తే సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో సిబ్బందికి నూతన కిట్‌బాక్సులు అందజేశారు. అలాగే సిబ్బంది కోసం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రాంగణం సందర్శించిన ఆయన దృష్టికి సిబ్బంది పలు సమస్యలు తీసుకెళ్లారు. వారి వినతుల మేరకు మొదటి ప్రాధాన్యతగా కొత్త కిట్ బాక్స్‌లు అందజేత, మరుగుదొడ్లు పునర్నిర్మించి ప్రారంభించడం, కొత్త హ్యాండ్ కఫ్స్ మంజూరు చేసి సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ సిబ్బందికి ఎక్కడ పని ఉంది? ఏమేం కావాలో తెలియజేస్తే ఆ ప్రకారం ఆయా పనులు చేయడానికి అవకాశం ఉంటుందని సూచించారు. తన నంబర్ 79950 95799కు తెలియజేసిన కిట్ బాక్స్, మరుగుదొడ్లు, హ్యాండ్ కఫ్స్, వెహికల్ పార్కింగ్‌కు షెడ్లు, విశ్రాంతి కోసం మెస్ వెయిటింగ్ హాల్, ఇలా అన్ని సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే ముద్దాయిల ఎస్కార్ట్ విధులకు తగ్గించాలన్న సిబ్బంది విజ్ఞప్తిపై కూడా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. తమ సంక్షేమానికి పెద్దపీట వేయడంపై సిబ్బంది సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఔరా కర్ర పెండలం



కర్ర పెండలంతో రైతు సన్యాసిరావు

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్‌లో ఒక కర్ర పెండలం దుంప ఔరా అనిపించింది. కశింకోట మండలం తోటకూరపాలేనికి చెందిన రైతు సన్యాసిరావు తన పొలంలో పండించిన కర్ర పెండలం 5.10 అడుగుల పొడవు ఉంది. ఈ దుంప ఐదు కిలోల బరువు తూగింది. సాధారణంగా కర్ర పెండలం కేవలం అడుగున్నర పొడవు మాత్రమే ఉంటుంది. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్‌కు సన్యాసిరావు ఈ కర్ర పెండలం అందజేశారు.

ముందస్తు జాగ్రత్తలతోనే డెంగ్యూ నివారణ



కృష్ణాగార్డెన్స్‌లో వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం : ముందస్తు జాగ్రత్తలతోనే డెంగ్యూ వ్యాధిని నిరోధించవచ్చని మలేరియా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కృష్ణాగార్డెన్స్‌లో ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా విభాగం సూపర్‌వైజర్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు. దోమల లార్వాలు అభివృద్ధి చెందే మొక్కల గోలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, గదిలోకి గాలి, వెలుతురు వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, కిటికీలు, ద్వారాలకు దోమ తెరలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటి ఆవరణలో వాడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు.

సౌకర్యాలు మెరుగుపర్చాలి



కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం పరిసరాలను పరిశీలిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని, పాడైన వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బీచ్ రోడ్‌లో ఉన్న ఐఎన్ఎస్ కురుసుర సబ్‌మెరైన్, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియాన్ని సందర్శించారు. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియం పరిసరాలను పరిశీలించారు. ఈ పర్యటనలో వీఎంఆర్‌డీఏ సీఈ భవానీశంకర్, ఈఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు రాజు, రామరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ మురళి, సహాయక ఇంజనీర్ హసీనా బేగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి అనగాని

విశాఖ సిటీ: జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయా జిల్లాలకు పతాకావిష్కరణ నిమిత్తం మంత్రులను నామినేట్ చేస్తూ రాష్ట్ర పరిపాలనా విభాగం శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖపట్నం జిల్లాకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నామినేట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంటూ జిల్లా కలెక్టర్ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించింది.